జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 102 25-4-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
జాతీయ దిన పత్రిక తొలివెలుగు మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

## ‘ఆర్టీసీ’ విలీనానికి ఓకే..

- చర్చలు సఫలం.. రోడ్డెక్కనున్న ఆర్టీసీ బస్సులు
- 11% పీఆర్‌సీ, కార్మిక సంఘాల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్
- మిగతా డిమాండ్ల పరిష్కారానికి అంగీకరించిన ఆర్టీసీ యాజమాన్యం
- సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రుల బృందంతో ఆర్టీసీ జేఏసీ నేతల సుదీర్ఘ చర్చలు

హైదరాబాద్: ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనంతోపాటు, కార్మిక సంఘాల గుర్తింపునకు ప్రభుత్వం ఎట్టకేలకు అంగీకరించటంతో మూడు రోజులుగా సాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె ముగిస్తున్నట్టు కార్మిక సంఘాల నేతలు ప్రకటించారు. శుక్రవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, వివేక్, లక్ష్మణ్‌కుమార్‌లతో కూడిన మంత్రుల బృందం ఆర్టీసీ కార్మికులతో సుదీర్ఘంగా చర్చించింది. 32 డిమాండ్లపై మంత్రులు చర్చించారు. కొన్నింటిపై సులువుగానే సమ్మతి రాగా, ప్రధాన డిమాండ్లపై మంత్రుల నుంచి సానుకూలత వ్యక్తం కాలేదు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, 2021, 2025 వేతన సవరణలు, ఆర్టీసీలో కార్మిక సంఘాల పునరుద్ధరణ.. ఈ మూడు డిమాండ్లపై ప్రతిష్టంభన నెలకొంది. చివరకు

- మిగతా 2వ పేజీలో






## ఇది నాకు కూడా కొత్తగానే ఉంది

### టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్‌ల శిక్షణ శిబిరానికి హాజరైన పార్టీ అధినేత చంద్రబాబు

- రాజకీయ పోరాటాలు చేశాను కానీ నేరగాళ్లతో పోరాడటం కొత్తగా ఉందని వ్యాఖ్యలు
- వైసీపీ ఒక కిల్లర్ పార్టీ అని, వారి ఆలోచనా విధానాన్ని అధ్యయనం చేయాలని సూచన
- దస్తగిరి హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు ఉదంతాలను ప్రస్తావిస్తూ క్యాడర్‌ను అప్రమత్తం చేసిన సీఎం
- కార్యకర్తలే టీడీపీకి అధినేతలని, ప్రతి ఒక్కరూ నాయకుడిగా ఎదగాలని పిలుపు

వైసీపీ విధ్వంసాన్ని ప్రజలకు గుర్తుచేస్తూ, ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలని దిశానిర్దేశం “నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాను కానీ, నేరగాళ్లతో ఏనాడూ పోరాడలేదు. ప్రస్తుత పరిణామాల్లో క్రిమినల్స్‌తో రాజకీయం చేయాల్సిన పరిస్థితి రావడం నాకు కూడా కొత్తగానే ఉంది“ అంటూ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన క్లస్టర్ ఇంఛార్జ్‌ల శిక్షణా తరగతుల్లో భాగంగా ఏర్పాటు చేసిన ‘కాఫీ కబుర్లు‘ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమకాలీన రాజకీయాలపై పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. వైసీపీని ఒక ‘కిల్లర్ పార్టీ‘గా అభివర్ణించిన చంద్రబాబు, ఆ పార్టీ ఆలోచనా విధానాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ కౌంటర్ ఇవ్వాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ అధికారంలో లేకపోయినా వారి అరాచకాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఇటీవల కడపలో జరిగిన దస్తగిరి హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు వ్యవహారం వంటి ఘటనలను ఉదాహరణలుగా చూపించారు. “కడపలో ప్రభుత్వ

- మిగతా 2వ పేజీలో

## నేడు కొత్త పార్టీ ప్రకటించనున్న కవిత

- గత ఏడాది తాను తండ్రికి రాసిన లేఖ లీక్ కావడంపై అసంతృప్తి
- కేసీఆర్ చుట్టూ చేరిన దెయ్యాలే కారణం అంటూ ధ్వజం
- హరీశ్‌రావు, సంతోష్ లపై తీవ్ర ఆరోపణలతో బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్
- శనివారం మేడ్చల్ జిల్లాలో పార్టీ ఆవిర్భావ సభకు ఏర్పాట్లు

హైదరాబాద్: బీఆర్ఎస్ నాయకత్వంతో విభేదించి బయటకు వచ్చిన.. పార్టీ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుమార్తె కవిత శనివారం సొంత పార్టీని ప్రారంభిస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాల నిర్వహణ, పార్టీ అధినేత ప్రసంగంలో లోపాలను ఎత్తిచూపుతూ తాను తండ్రికి రాసిన లేఖ లీక్ కావడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా లేఖ

2లో






## విజయసాయిరెడ్డి నివాసంలో ముగిసిన ఈడీ సోదాలు

- ఏపీ లిక్కర్ స్కాం కేసులో దర్యాప్తు ముమ్మరం
- మనీలాండరింగ్ అనుమానాలపై ఈడీ సోదాలు
- విజయసాయి నివాసంలో దాదాపు 13 గంటల పాటు సోదాలు
- సోదాల సమయంలో నివాసంలోనే ఉన్న విజయసాయి!

2లో



## ఆప్‌కు రాఘవ్ చద్దా భారీ షాక్..

- ఏకంగా ఏడుగురు ఎంపీలు బీజేపీలోకి..
- బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటన..
- ఆయనతో పాటు మరో ఇద్దరు ఎంపీలు కూడా..
- మొత్తంగా ఏడుగురు ఎంపీలు బీజేపీలోకి జంప్..

2లో

## మే 4న అటవిక పాలనకు డెత్ డే

- టీఎంసీ గూండాలను తరిమికొడతాం
- మహిళలపై ప్రభుత్వ అరాచకాలను బహిర్గతం చేస్తాం : ఇది మోదీ గ్యారంటీ
- ఫలితాలొచ్చాక టీఎంసీ గూండాలు దాక్కోడానికి రాష్ట్రంలో చోటే ఉండదు
- ప్రభుత్వం ఆర్జీకర్ బాధితురాలిని తల్లికి దూరం చేసింది
- బెంగాల్‌లో ఎన్నికల ప్రచార సభల్లో మమత సర్కార్‌పై ప్రధాని మోదీ విమర్శల జడి

మే 4న ఆటవిక పాలన అంతం కాబోతుందని ప్రధాని మోడీ అన్నారు. రెండో దశలో జరగబోయే ఎన్నికల ప్రచారంలో భాగంగా డం డం అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన సభలో మోడీ మాట్లాడారు. “పశ్చిమ బెంగాల్, తమిళనాడు ప్రజలకు నేను అభినందనలు తెలియజేస్తున్నాను. బెంగాల్ ఎన్నికల మొదటి దశలో జరిగిన పోలింగ్.. గత కొంతకాలంగా గమనిస్తున్న మార్పు



## చంద్రబాబువి నీచ రాజకీయాలు..



- దమ్ముంటే జగన్‌పై నేరుగా యుద్ధం చేయాలి: సతీశ్ రెడ్డి
- చంద్రబాబు ఆపదలో ఉన్నప్పుడల్లా ఈనాడు, ఆంధ్రజ్యోతి తప్పుడు కథనాలు అల్లుతున్నాయన్న సతీశ్
- జగన్ కు సంబంధం లేని లింకులు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపాటు

## శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు.. రేవంత్ సర్కార్ చేసిన హత్య

- ఈ ఉదయం మృతి చెందిన శంకర్ గౌడ్
- పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు అనుమతించకపోవడం దుర్మార్గమన్న కేటీఆర్
- అరెస్ట్ చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్

2లో

## సొరంగం.. ఇక వేగిరం

- నివేదికలో ప్రమాదకర జోన్లు, ఊటనీటి ప్రవాహం, పైకప్పు పటిష్టతపై సమాచారం
- 2డీ, 3డీ చిత్రాలతో భూగర్భంలో స్థితిగతులపై స్పష్టమైన సమాచారం లభ్యతలోకి
- నివేదికను అధ్యయనం చేసి తగిన చర్యలు తీసుకుంటామన్న మంత్రి ఉత్తమ్
- సొరంగం తవ్వకాల వేగాన్ని నెలకు 400 మీటర్లకు పెంచాలని ఆదేశం

2లో



## సీఎం హామీపై దుష్ప్రచారం..

- సీఎం చంద్రబాబు హామీపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం
- తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన మంత్రి నారా లోకేష్
- బ్యాటరీ ఆటో హామీపై అసలు వాస్తవాలను వెల్లడించిన ప్రభుత్వం
- ఫేక్ వీడియోలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక

2లో



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



# శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు.. రేవంత్ సర్కార్ చేసిన హత్య

నర్సంపేట ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన 'హత్య' అని ఆయన అన్నారు. శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. అరెస్టు చేసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సహా కార్మిక నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్యాయత్నం చేయడం తెలంగాణ చరిత్రలో ఒక 'చీకటి రోజు' అని, అయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఆర్టీసీ కార్మికులు ఎవరూ అధైర్యపడవద్దని, బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని, ప్రభుత్వ మెడలు వంచి హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు.

# మే 4న అటవిక పాలనకు డెత్ డే..

(మొదటి పేజీ తరువాయి)

కనిపిస్తోంది. నిన్న బీజేపీకి లభించిన మద్దతు.. బీజేపీ విజయానికి సంకేతం..” అని అన్నారు. “రాష్ట్రంలో టీఎంసీ ప్రభుత్వాన్ని మార్చేస్తామని బెంగాల్ మహిళలు చెబుతున్నారు. టీఎంసీ ఒక మహిళా వ్యతిరేక పార్టీ. బీజేపీ మాత్రం మహిళా నేతృత్వ అభివృద్ధి నమూనాపై పనిచేస్తుంది. ఓ కూతురు.. టీఎంసీ అరాచక పాలనకు బలైపోగా.. బీజేపీ ఆమెను అభ్యర్థిగా నిలబెట్టింది. సందేశ్‌ఖాలి బాధితులకు కూడా నాయకత్వం వహించేందుకు బీజేపీ అవకాశం కల్పించింది. బెంగాల్ కుమార్తెలు న్యాయం కోరినప్పుడు.. అత్యాచారానికి గురికాకుండా ఉండేందుకు ఇళ్ల నుంచి బయటకు రావద్దని టీఎంసీ చెబుతుంది. మహిళలు కలలు కనడం టీఎంసీకి ఇష్టం లేదు. బెంగాల్ కుమార్తెల కలలను ఎవరూ తొక్కేయడానికి బీజేపీ అనుమతించదని ఈ రోజు నేను బెంగాల్‌లోని ప్రతి కుమార్తెకు హామీ ఇస్తున్నాను. మహిళల భద్రతే మా ప్రాధాన్యత అని నేను మీకు హామీ ఇస్తున్నాను. మే 4న బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలపై జరిగిన అన్ని అఘాయిత్యాలపై ఫైళ్లను తెరుస్తాం. ఇది మోడీ హామీ.” అని పేర్కొన్నారు. “ఇది విప్లవాల గడ్డ. ఇది వీరుల నేల అని మర్చిపోవద్దు. మే 4న ఫలితాలు వెలువడిన తర్వాత టీఎంసీ గూండాలకు దాక్కోవడానికి ఏ చోటూ దొరకదు. వారిని రక్షించడానికి ఎవరూ ఉండరు. నిన్న జరిగిన మొదటి దశ పోలింగ్.. టీఎంసీ సాగిస్తున్న 'అటవిక పాలన'కు మరణఘంటిక మోగించింది.” అని అన్నారు.

# విజయసాయిరెడ్డి నివాసంలో ముగిసిన ఈడీ సోదాలు

ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాం కేసులో భాగంగా మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిర్వహించిన సోదాలు ముగిశాయి. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న ఆయన ఇంట్లో శుక్రవారం ఉదయం ప్రారంభమైన తనిఖీలు సుమారు 13 గంటల పాటు కొనసాగి సాయంత్రం వేళకు ముగిశాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో (2019-2024) మద్యం విధానంలో వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఈడీ అనుమానిస్తోంది. డిజిటల్ చెల్లింపులను నిరుత్సాహపరిచి, కేవలం నగదు లావాదేవీల ద్వారా వచ్చిన సొమ్మును షెల్ కంపెనీలకు మళ్లించి మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. సోదాల సమయంలో ఇంట్లోనే ఉన్న విజయసాయి రెడ్డిని అధికారులు మద్యం పాలసీ రూపకల్పన, ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఆయన ఇంట్లోని పలు కీలక పత్రాలతో పాటు ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వీటిలోని డేటాను విశ్లేషించడం ద్వారా ఈ కేసులో కీలక ఆధారాలు లభిస్తాయని ఈడీ భావిస్తోంది. ఈ కేసులోని ఇతర నిందితుల ఇళ్లలో కూడా ఈడీ సోదాలు చేపట్టింది. ఈ సోదాలు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని వైసీపీ ఆరోపిస్తుండగా, ప్రభుత్వ ధనాన్ని దోచుకున్న వారిని వదిలిపెట్టవద్దని అధికార కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ కేసులో లభించే ఆధారాలను బట్టి మరికొందరు కీలక నేతలకు కూడా నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

# సీఎం హామీపై దుష్ప్రచారం..

ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని వక్రీకరించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై మంత్రి నారా లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడియోలను ఎడిట్ చేసి దుష్ప్రచారం చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వైసీపీ ఎన్నిసార్లు చెప్పినా తన తప్పుడు ప్రచారాల అలవాటును మార్చుకోవడం లేదని విమర్శించారు. తిరుపతి జిల్లా నాయుడుపేటలో మార్చి 30న జరిగిన టిడ్కో ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముక్కర అంబిక అనే లబ్ధిదారురాలి ఇంటికి వెళ్లి సత్యనారాయణ స్వామి వ్రతంలో పాలుపంచుకున్నారు. ఆమె భర్త ఆటో డ్రైవర్ అని తెలుసుకుని, ఆయనకు జీవనోపాధి కోసం ఒక బ్యాటరీ ఆటోను ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌ను అక్కడికక్కడే ఆదేశించారు.

# ఆప్‌కు రాఘవ్ చద్దా భారీ షాక్..

రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కు రాజీనామా చేశారు. ఆయన రాజీనామా అనంతరం బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. చద్దాతో పాటు మరో ఇద్దరు ఎంపీలు మొత్తంగా ముగ్గురు ఎంపీలు ఆప్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. చద్దాతో పాటు సందీప్ పాఠక్, అశోక్ మిత్తల్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ తన సూత్రాల నుంచి పక్కకు తప్పుకుందని, మూడింట రెండు వంతు ఎంపీలతో బీజేపీలో చేరుతున్నట్లు సంచలన ప్రకటన చేశారు. ప్రధాని మోడీ నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని చెబుతూ, బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. రాజ్యసభలో ఆప్‌కు ఉన్న 10 మంది ఎంపీల్లో 7 మంది బీజేపీలో విలీనం కానున్నారు. బీజేపీలో విలీనం అవుతున్న వారిలో హర్భజన్ సింగ్, స్వాతి మలివాల్,రాజేంద్ర గుప్తా, విక్రమ్ సహానీ వంటి వారు ఉన్నారు. నా జీవితంలో 15 ఏళ్లుగా ఆప్‌కు సేవ చేశానని, నిజాయితీతో కూడిన రాజకీయాలు చేశానని, ఇప్పుడు ఆప్ వాటికి దూరమైందంటూ చద్దా విమర్శించారు. అందుకే పార్టీ నుంచి బయటకు వచ్చి, ప్రజలకు చేరువవుతున్నట్లు వెల్లడించారు.

# 'ఆర్టీసీ' విలీనానికి ఓకే..

(మొదటి పేజీ తరువాయి)

అర్ధరాత్రి సమయంలో వీటికి మంత్రులు ఓకే చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో మూడొంతులు పూర్తయిన... ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియను పూర్తి చేసేందుకు అంగీకరించారు. 2021 వేతన సవరణకు సంబంధించి ఏడు శాతంతో మొదలై చివరకు 10 శాతం మేరకు మంత్రులు ప్రతిపాదించిన ఫిట్‌మెంట్‌కు కార్మిక సంఘాల నేతలు సమ్మతించారు. కార్మిక సంఘాలను పునరుద్ధరించి ఎన్నికలు జరిపేందుకు కూడా మంత్రులు అంగీకరించారు. మిగతా డిమాండ్లను ఆర్టీసీ బోర్డు, ఎండీ ఆధ్వర్యంలో పరిష్కరిస్తారని మంత్రులు పేర్కొనటంతో కార్మిక సంఘాల సమ్మె విరమణకు అంగీకరించాయి. దీంతో బుధవారం తెల్లవారుజాము నుంచి శుక్రవారం వరకు జరిగిన సమ్మె ముగిసింది. శనివారం ఉదయం మొదటి షిఫ్ట్ నుంచి బస్సులు యథావిధిగా రోడ్డెక్కుతాయని ప్రకటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయించి ప్రక్రియ ప్రారంభించింది. అప్పటికే ఆంధ్రప్రదేశ్ ఈ విలీన ప్రక్రియ జరగ్గా, తెలంగాణలో మాత్రం జరగలేదు. కార్మిక సంఘాల నుంచి కూడా పెద్దగా డిమాండ్ లేకపోవటంతో దాని ఊసే లేదు. కానీ ఎన్నికలకు ముందు నాటి ప్రభుత్వం ఉన్నట్టుండి ఆ ప్రక్రియ ప్రారంభించింది. గవర్నర్ ఆమోదంతో గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ అయ్యింది. అపాయింటెండ్ డేట్ ప్రకటించకుండా, విలీన ప్రక్రియ ఎలా జరగాలో తేల్చే పేరుతో ప్రభుత్వం సీనియర్ అధికారుల కమిటీ ఏర్పాటు చేసింది. ఆ వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావటంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. అప్పటి నుంచి కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తున్నా... ప్రభుత్వం మాత్రం దాని ఊసెత్తలేదు. ఎన్నికల సందర్భంగా, ఆ ప్రక్రియను పూర్తి చేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పినా, అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం పట్టించుకోలేదు. చివరకు కార్మిక సంఘాలు సమ్మెకు దిగటం, సమ్మె రెండో రోజే ముగ్గురు కార్మికులు ఆత్మహత్యలకు యత్నించటం, అందులో డ్రైవర్ శంకర్‌గౌడ్ మృతి చెందటంతో ప్రభుత్వం దిగి వచ్చింది. చాలా దీర్ఘకాల డిమాండ్లను పరిష్కరిస్తూ వచ్చినా, కార్మిక సంఘాలు సమ్మెకు దిగటాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం తొలుత కఠినంగానే వ్యవహరించాలని భావించింది. కానీ, శంకర్‌గౌడ్ ఆత్మహత్య, మరో ఇద్దరు కార్మికుల ఆత్మహత్య యత్నంతో ప్రభుత్వం తీరు మార్చుకుంది. ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలతో సమ్మె పరిష్కార చర్చలు ఏకంగా 13 గంటలపాటు సాగాయి. శుక్రవారం ఉదయం 11.30కు తొలుత ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్‌రాజ్, దానకిశోర్, ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిలతో కూడిన అధికారుల కమిటీ సచివాలయంలో భేటీ అయింది. నాలుగు రోజుల క్రితం ఇదే కమిటీతో జరిగిన చర్చలు విఫలమైన విషయం తెలిసిందే. ఆ చర్చలు విఫలమైన మరుసటిరోజు తొలి షిఫ్టు నుంచే సమ్మె మొదలైంది. శుక్రవారం ఈ కమిటీతో చర్చలు మధ్యాహ్నం భోజన విరామ సమయం వరకు జరిగాయి. భోజనానంతరం మధ్యాహ్నం మూడున్నర గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, లక్ష్మణ్‌కుమార్‌లతో ప్రారంభమయ్యాయి. ఏకబిగిన ఆ చర్చలు అర్ధరాత్రి 12.30 వరకు కొనసాగటం విశేషం. తొలుత రెండు జేఏసీల ప్రతినిధులతో, సంఘాల వారీగా, మధ్యలో జేఏసీ ప్రతినిధుల వారీగా చర్చలు జరిపారు. కొద్దిసేపు మంత్రులు వారిలోవారు విడిగా చర్చించుకోగా, కార్మిక సంఘాల నేతలు వారిలో వారు చర్చించుకున్నారు.



# తెలంగాణ ప్రజా జాగృతి

(మొదటి పేజీ తరువాయి)

లీక్ కావడానికి కేసీఆర్ చుట్టూ చేరిన దెయ్యాలే కారణమంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆనాటి నుంచి పార్టీపై, నాయకత్వంపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ ఆరోపణలు రోజురోజుకు పెంచుతుండడంతో పాటు.. పార్టీలో కీలక నేతలు హరీశ్‌రావు, సంతోష్ రావులపై తీవ్రమైన ఆరోపణలు చేసి పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారంటూ గత సెప్టెంబర్ 2న కవితను బీఆర్ఎస్ సస్పెండ్ చేసింది. అయితే ఆ మరుసటి రోజునే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు కవిత ప్రకటించారు. అప్పటి నుంచి సొంత పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తూ వచ్చిన కవిత.. 'తెలంగాణ ప్రజా జాగృతి'పేరిట ఏర్పాటు చేస్తున్న కొత్త పార్టీ జెండా, ఎజెండాను శనివారం మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో జరిగే సభలో ఆవిష్కరించనున్నారు. ఉదయం 8 గంటలకే అక్కడి ఓ ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో ఈ మేరకు సంబురాలు ప్రారంభం కానున్నాయి. కవిత ఉదయం 7.30కు బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి బయలుదేరి 8.15కు అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కులోని అమరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తారు. 9.30కు మునీరాబాద్ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 10 గంటలకు వేదిక పక్కనే ఏర్పాటు చేసిన గద్దెపై పార్టీ జెండాను ఆవిష్కరిస్తారు. కన్వెన్షన్ సెంటర్‌తో పాటు పక్కనే ఉన్న 20 ఎకరాల విస్తీర్ణంలో సభకు ఏర్పాట్లు చేశారు. ఈ ప్రాంగణానికి తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్తగా పేరొందిన ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టారు. స్వాగత ద్వారాలకు, భోజనశాలలకు కూడా పేర్లు పెట్టారు. సభ అనంతరం ర్యాలీగా లిబర్టీ చౌరస్తాకు చేరుకుంటారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం కవిత తిరిగి బంజారాహిల్స్ నివాసానికి చేరుకుంటారు. 2024 మార్చిలో ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన కేసులో అరెస్టై సుమారు 5 నెలల పాటు ఢిల్లీ తీహార్‌లో జైలు జీవితం గడిపారు. ఆగస్టులో విడుదల కాగా ఇటీవల సీబీఐ కోర్టు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మరికొందరితో పాటు కవితకు కూడా ఈ కేసులో క్లీన్‌చిట్ ఇచ్చింది. కవిత తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో అమెరికా నుంచి తిరిగి వచ్చారు. 2006లో ఉద్యమానికి సాంస్కృతిక కోణాన్ని జోడించారు. బతుకమ్మ సంబురాలతో పాటు ఇతర సాంస్కృతిక, రాజకీయ కార్యకలాపాల ద్వారా క్రియాశీలంగా పనిచేశారు. 2014లో నిజామాబాద్ ఎంపీగా గెలిచారు. 2019లో ఓటమి అనంతరం 2020లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

# ఇది నాకు కూడా కొత్తగానే ఉంది

(మొదటి పేజీ తరువాయి)

భూముల పంపకాల్లో తేడాలు రావడంతో సొంత పార్టీ కార్యకర్త దస్తగిరినే హత్య చేశారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి కలిసి ఈ దోపిడీకి పాల్పడ్డారు. వాళ్ల మనుషుల్ని వాళ్లే చంపుకుని, ఆ నేరాన్ని మనపై నెట్టే ప్రయత్నం చేస్తారు. ఇలాంటి వాటి పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలి“ అని చంద్రబాబు హెచ్చరించారు. అదేవిధంగా, డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య ఉదంతాన్ని గుర్తుచేస్తూ, ఎమ్మెల్సీ అనంతబాబు సాక్షులను సైతం బెదిరించారని ఆరోపించారు. “రోడ్ల మీదకు వస్తారు, రెచ్చగొడతారు, ప్రజలను ఇబ్బందులు పెడతారు. చర్యలు తీసుకుంటే దాన్ని రాజకీయం అంటారు. అన్యాయం జరిగిందని పరామర్శకు వెళ్లి, సొంత కార్యకర్తలను కార్ల కింద తొక్కించి చంపుతారు. కానీ తన కారు కింద పడిన కార్యకర్తను మాత్రం పరామర్శించరు. ఇలాంటి పార్టీని నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు“ అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2019-24 మధ్య జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు నిత్యం గుర్తుచేయాలని, అదే సమయంలో ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను, వాటి అమలులో పడుతున్న కష్టాన్ని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. “నన్ను అరెస్టు చేసినా, పార్టీని ఎన్ని ఇబ్బందులు పెట్టినా కార్యకర్తలను కాపాడుకున్నాను. టీడీపీలో కార్యకర్తలే అధినేతలు. ప్రతి కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దుతాం. రైట్ రాయల్‌గా బతకాలి. పార్టీ ఇచ్చే అవకాశాలను అందిపుచ్చుకుని మీరు ఎదగాలి“ అని ఆయన పిలుపునిచ్చారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలకు మంచి చేస్తే వారే మనల్ని గుర్తుంచుకుంటారని చంద్రబాబు హితవు పలికారు.

# చంద్రబాబువి నీచ రాజకీయాలు..




చంద్రబాబు ఆపదలో ఉన్నప్పుడల్లా ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు తప్పుడు కథనాలు అల్లుతున్నాయని వైసీపీ ప్రధాన కార్యదర్శి సతీశ్ రెడ్డి ఆరోపించారు. జగన్ కు లేనిపోని లింకులు పెడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. వేంపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల హామీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే చంద్రబాబు ఇలాంటి 'పొలిటికల్ గేమ్స్' ఆడుతున్నారని విమర్శించారు. మాచర్లలో టీడీపీ నేతలు తమలో తాము చంపుకుంటే, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మీద అక్రమ కేసులు పెట్టారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జరుగుతున్న హత్యలకు ఏ1గా చంద్రబాబుపైనే కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

# సొరంగం.. ఇక వేగిరం

హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం తవ్వకాలు మళ్లీ వేగిరం కానున్నాయి. తవ్వకాలు జరపాల్సిన భూగర్భ మార్గం ఎంత మేరకు సురక్షితమైనది? ఎక్కడెక్కడ ప్రమాదకర జోన్లు ఉన్నాయి? భూగర్భంలో ఊట నీటి ప్రవాహం ఉందా? ఇప్పటికే తవ్విన సొరంగం పైకప్పు పటిష్టత ఎలా ఉంది? అనే అంశాలపై కీలకమైన సమాచారంతో కూడిన నివేదికను నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్జీఆర్ఐ) ప్రధాన శాస్త్రవేత్త హెచ్‌వీఎస్ సత్యనారాయణ శుక్రవారం సచివాలయంలో మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అందజేశారు. 26 మీటర్ల వ్యాసం కలిగిన ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ లూప్‌ను హెలికాప్టర్ ద్వారా సొరంగమార్గం ఉపరితలంపై వేలాడదీస్తూ ముందుకు సాగడం ద్వారా నిర్వహించి సర్వే ఆధారంగా ఈ నివేదికను ఎన్జీఆర్ఐ రూపొందించింది. ఈ సర్వేలో ఎన్జీఆర్ఐ సిస్మిక్ ఇమేజింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ (ఈఆర్టీ) వంటి అధునాతన జియోఫిజికల్ సాంకేతికతను ఎన్జీఆర్ఐ రూపొందించింది. భూగర్భంలోకి పంపిన తరంగాలు దేనినైనా ఢీకొని పరివర్తనం చెందుతున్నాయా? లేదా? అనే అంశాన్ని పసిగట్టి 2డీ, 3డీ చిత్రాలను సిస్మిక్ ఇమేజింగ్ టెక్నాలజీ ద్వారా రూపొందిస్తారు. ఇదే తరహాలో భూమి లోపల విద్యుత్‌ను పంపించి విద్యుత్ వాహక స్థితిగతులను అంచనా వేయడం ద్వారా లోపలి పరిస్థితులపై 2డీ, 3డీ చిత్రాలను ఈఆర్టీ టెస్టు ద్వారా రూపొందిస్తారు. భూగర్భంలో ఖాళీలు, బలహీన ప్రాంతాలు, నీటి ప్రవాహాన్ని గుర్తించడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయి. సొరంగం తవ్వాల్సిన మార్గంలో భూగర్భ పరిస్థితులను సమగ్రంగా విశ్లేషించి తవ్వకాల సందర్భంగా ఎలాంటి ప్రమాదాలకు తావు కల్పించకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడానికి ఈ సమాచారం కీలకం కానుంది. గతేడాది ఫిబ్రవరి 22న ఎస్ఎల్‌బీసీ సొరంగం పైకప్పు కుప్పకూలి కార్మికులు గల్లంతైన విషయం తెలిసిందే. దీంతో సొరంగం తవ్వకాలను నిలుపుదల చేసిన ప్రభుత్వం ఏడాది విరామం తర్వాత గత నెలలో డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ టెక్నాలజీతో పునరుద్ధరించింది. రెండు వైపుల నుంచి నెల రోజుల్లో సుమారు 151.5 మీటర్ల మేర సొరంగం తవ్వకాలను పూర్తి చేశారు.

**నెలకు చెరో వైపు నుంచి 200 మీటర్ల తవ్వకాలు**

సొరంగం తవ్వకాల్లో కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేశామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. తవ్వకాలు పూర్తి చేసేందుకు ఎన్జీఆర్ఐ నివేదికలోని సమాచారం కీలకం కాబోతోందన్నారు. ఎన్జీఆర్ఐ పనితీరును ప్రశంసించిన మంత్రి .. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణకు నిర్వహిస్తున్న భూగర్భ పరీక్షల్లో సహకరించాలని సూచించారు. ఎన్జీఆర్ఐ నివేదికను సమగ్రంగా అధ్యయనం జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. దేశ, విదేశాల నుంచి యంత్రాలను సమీకరించి సొరంగం తవ్వకాలను వేగిరం చేయాలని ఆదేశించారు. నెలకు చెరో వైపు నుంచి 200 మీటర్ల మేర సొరంగం తవ్వకాలు జరిగేలా వేగాన్ని నెలరోజుల్లోగా పెంచాలని, ఇందుకు అవసరమైన ఎలక్ట్రిక్ లోడర్లు, హెవీ డంపర్లు వంటి భారీ యంత్రాలను సమీకరించాలని ఆదేశించారు.

# పవిత్ర స్థలంలో అపవిత్ర క్రీడ!

- మల్లన్న గుట్టపై గుట్టుగా పేకాట.. పోలీసుల ఎంట్రీతో పరుగో పరుగు
- 11 మంది జూదరుల అరెస్ట్.. రూ. 62 వేలకు పైగా నగదు సీజ్
- జూదరుల ఆటకట్టిస్తాం: రాజాపేట ఎస్ఐ లింగారెడ్డి వార్నింగ్



**తొలివెలుగు, రాజాపేట:** దైవ దర్శనం కోసం భక్తులు వెళ్లే పవిత్ర స్థలాన్ని కొందరు జూదరులు తమ అడ్డాగా మార్చుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతూ పోలీసులకే సవాల్ విసిరారు. పక్కా సమాచారంతో ఎంట్రీ ఇచ్చిన ఖాకీలు.. జూదరుల ఆటకట్టించారు. రాజాపేట శివారులోని మల్లన్న గుట్టపై శుక్రవారం జరిగిన పోలీసుల దాడిలో 11 మంది పేకాట రాయుళ్లు పట్టుబడ్డారు. ఎస్ఐ లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మల్లన్న గుట్ట మీదున్న ఆంజనేయ స్వామి గుడికి సమీపంలో భారీ ఎత్తున పేకాట నడుస్తోందని పోలీసులకు పక్కా ఇన్ఫర్మేషన్ వచ్చింది. వెంటనే అలర్ట్ అయిన ఎస్ఐ లింగారెడ్డి, తమ సిబ్బంది యాదయ్య, మారుతి, ప్రదీప్, మహేష్, నరేందర్, ఘాన్సీరామ్‌లతో కలిసి అక్కడికి చేరుకుని స్థావరాన్ని చుట్టుముట్టారు. పోలీసులను చూసి కంగుతిన్న జూదరులు ఎక్కడికక్కడే పరుగులు తీశారు. వాళ్లని వెంబడించి మరీ 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో స్థానికులైన చాకలి వెంకటేష్, బట్టికారి యాదా గౌడ్, మేకల మోహన్, శ్రీరామ్ సంతోష్, పిట్లా ప్రవీణ్, ఎండీ రహీమ్, నవ్వులపల్లి రాజు, కీచనగరి ఎల్లయ్య, దండు చంద్రశేఖర్, జూపల్లి సాయిరాం, గౌటె భాస్కర్ ఉన్నారు. స్పాట్ నుంచి తప్పించుకున్న మరో ముగ్గురి కోసం పోలీసులు వల పన్నారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.62,800 నగదుతో పాటు, 2 సెట్ల పేక ముక్కలు, 9 సెల్‌ఫోన్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లింగారెడ్డి మాట్లాడుతూ.. "మండలంలో ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా, పేకాట ఆడినా ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. జైలు ఊచలు లెక్కపెట్టిస్తాం" అని ఆయన స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

# రాష్ట్ర పండుగగా 'శ్రీ వాసవి మాత జయంతి'

- ఏప్రిల్ 26న అధికారికంగా వేడుకలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు ఆదేశం



**తొలివెలుగు, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. వైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని ప్రతి ఏటా రాష్ట్ర అధికారిక వేడుకగా నిర్వహించాలని నిశ్చయించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) గురువారం జి.ఓ.ఎం.ఎస్ నంబర్ 67ను విడుదల చేసింది. ప్రతి సంవత్సరం వైశాఖ శుక్ల పక్ష దశమి నాడు ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్ 26వ తేదీన వాసవి మాత జయంతి పురస్కరించుకుని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఈ కార్యక్రమాల పర్యవేక్షణకు యువజన అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖను నోడల్ ఏజెన్సీగా నియమించింది. వేడుకలకు అయ్యే ఖర్చులను సదరు శాఖ బడ్జెట్ నుంచే వెచ్చించాలని స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందిన ఆదేశాల మేరకు, గవర్నర్ ఆమోదంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు ఈ ఉత్తర్వులపై సంతకం చేశారు. ఈ నిర్ణయం పట్ల ఆర్యవైశ్య సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా కేంద్రాల్లో వేడుకలు జరిపేలా అధికారులు ఇప్పటికే సన్నద్ధమయ్యారు.

# గ్రామ వికాసానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలి

- కొత్తజాలలో ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం
- పారిశుధ్యంపై గ్రామస్తుల సామూహిక ప్రతిజ్ఞ

**తొలివెలుగు, రాజాపేట:** గ్రామాల అభివృద్ధిలోనే దేశాభివృద్ధి దాగి ఉందని, పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారానే అది సాధ్యమవుతుందని కొత్తజాల సర్పంచ్ లావణ్య ధర్మేందర్ సింగ్ అన్నారు. శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా రాజాపేట మండలం కొత్తజాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతి గడప స్వచ్ఛతను పాటించినప్పుడే గ్రామం ఆరోగ్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామస్తులందరితో కలిసి స్వచ్ఛత, పరిశుభ్రతపై సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు వార్డు సభ్యులు, ప్రజలు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమత, ఉప సర్పంచ్ ఠాకూర్ ధన్ రాజ్ సింగ్, వార్డు సభ్యులు కాకాల్ల భాగ్య ఐలయ్య, మొగిలి చంద్రయ్య, కాయితి వందన వెంకట్ రెడ్డి, చెప్యాల రామయ్య, అంగన్‌వాడీ టీచర్ కొత్త ఇంద్ర, ఆశా వర్కర్ లత, గ్రామస్తులు పాల్గొన్నారు.




# ఆ నిండు ప్రాణం బలితీసుకుంది సర్కారే!

- కార్మికుల పట్ల సర్కారుది ద్వంద్వ వైఖరి
- పనిభారంతోనే ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మార్పణం
- బాధిత కుటుంబానికి శాశ్వత ఉద్యోగం కల్పించాలి
- బీసీవై పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ డిమాండ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** ఆర్టీసీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని బీసీవై పార్టీ తెలంగాణ రాష్ట్ర పీఏసీ సభ్యుడు డాక్టర్ చిలకల శ్రీనివాస్ యాదవ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం అత్యంత హృదయ విదారకమని, ఒక కుటుంబానికి పెద్దదిక్కైన వ్యక్తి ఇలా ప్రాణత్యాగం చేయాల్సిన దుస్థితి రావడం సమాజానికి, ప్రభుత్వ వ్యవస్థల పనితీరుకు సిగ్గుచేటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... శంకర్ గౌడ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టకాలంలో ఆ కుటుంబానికి ధైర్యం చేకూరాలని ఆకాంక్షించారు. ఈ ఘటన కేవలం ఒక వ్యక్తిగత విషాదం కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలకు అద్దం పడుతోందని ఆయన విశ్లేషించారు. ఎన్నికలకు ముందు కార్మికులకు ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వారిని గాలికి వదిలేయడం ప్రభుత్వానికి తగదన్నారు. కార్మికుల ఆశలపై నీళ్లు చల్లడం దారుణమన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా, ఆర్టీసీలో అవుట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహిస్తుండటం వల్లే ఉన్న సిబ్బందిపై విపరీతమైన పని ఒత్తిడి పెరుగుతోందని, ఆ మానసిక క్షోభతోనే కార్మికులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు జరిగిన ప్రతిసారీ కేవలం కొంత నష్టపరిహారం ప్రకటించి చేతులు దులుపుకోవడం ప్రభుత్వాలకు పరిపాటిగా మారిందని, ఇది సమస్యను పక్కదారి పట్టించడమేనని దుయ్యబట్టారు. మూల సమస్యలను పరిష్కరించకుండా ఇలాంటి కంటితుడుపు చర్యలు తీసుకుంటే ఆర్టీసీ వ్యవస్థ మరింత దిగజారుతుందని హెచ్చరించారు. బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ మార్గదర్శకత్వంలో ఆర్టీసీ కార్మికుల పక్షాన నిలబడతామని, వారి హక్కుల సాధనలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. శంకర్ గౌడ్ కుటుంబానికి తగిన ఆర్థిక సాయంతో పాటు, ఆ కుటుంబంలో ఒకరికి తక్షణమే శాశ్వత ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే బోడే రామచంద్ర యాదవ్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు ఉధృతం చేస్తామని డా. శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు.



# అక్షర యోధుడికి వీడ్కోలు!





- మల్లాపురం హెచ్ఎం గవ్వల రాములు రిటైర్మెంట్ వేడుక
- తరలివచ్చిన శిష్యులు, తోటి ఉపాధ్యాయులు
- ఘనంగా సన్మాన కార్యక్రమం

**తొలివెలుగు, రాజాపేట:** ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన గవ్వల రాములు సేవలు వెలకట్టలేనివని పలువురు వక్తలు కొనియాడారు. యాదగిరిగుట్ట మండలం మల్లాపురం ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న రాములు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో అభినందన సత్కార సభను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో సరస్వతీ మాత చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ వేడుకలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. రాములు తన సుదీర్ఘ ప్రస్థానంలో నిబద్ధతతో పనిచేశారని, ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలిపారని ప్రశంసించారు. విధి నిర్వహణ నుంచి విరమణ పొందినా, సమాజ సేవలో చురుగ్గా పాల్గొనాలని వారు కోరారు. అనంతరం రాములు-లక్ష్మి దంపతులను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పంచాహ్నిక దీక్షతో నృసింహ జయంతి ఉత్సవాలు!

- యాదాద్రిలో నేటి నుంచే ఆధ్యాత్మిక శోభ
- పాతగుట్టలో మూడు రోజులు.. ప్రధానాలయంలో ఐదు రోజులు
- భక్తుల కోసం భారీగా సాంస్కృతిక ఏర్పాట్లు
- తరలిరానున్న 21 మంది రుత్వికులు

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదాద్రి గిరిధామం జయంతి ఉత్సవాలకు ముస్తాబైంది. స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జయంతి వేడుకలను ఈసారి మునుపెన్నడూ లేని విధంగా ఐదు రోజుల పాటు (పంచాహ్నికంగా) నిర్వహించాలని దేవస్థానం నిర్ణయించింది. నేటి నుంచి ప్రారంభం కానున్న ఈ ఆధ్యాత్మిక క్రతువు కోసం ఆలయ గర్భాలయం, యాగశాలలను సుందరంగా తీర్చిదిద్దారు. 21 మంది వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య హోమగుండాలు ప్రజ్వరిల్లనున్నాయి. ప్రధాన ఆలయంలో 26వ తేదీ ఆదివారం ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనంతో వేడుకలు మొదలై.. 30వ తేదీ గురువారం సాయంత్రం నృసింహ ఆవిర్భావ ఘట్టంతో ముగియనున్నాయి. ప్రతిరోజూ స్వామివారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సోమవారం నిర్వహించే లక్ష పుష్పార్చన వేడుక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, మంచినీరు, ప్రసాదాల పంపిణీలో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అధికారులు చెప్పారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు, సంకీర్తనలతో భక్తులను అలరించేందుకు భారీగా సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

## గుండు రాజు కుటుంబాన్ని పరామర్శించిన పరమేశ్వర్‌రెడ్డి



**తొలివెలుగు, రాజాపేట:** హబ్సిగూడకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గుండు రాజు తల్లి అనసూయ మృతి పట్ల ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన రాజాపేటలోని రాజు నివాసానికి చేరుకుని, అనసూయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. పార్టీకి నిబద్ధతతో సేవ చేస్తున్న రాజు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ పరామర్శలో కాంగ్రెస్ నాయకులు కంది శ్రవణ్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు విజయ్, పేట మురళి ముదిరాజ్, వాళ్ళపు శ్రీకాంత్ యాదవ్, అజ్జిజ్, మలు నాయక్, వాసు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ కుట్రలకు కోర్టు స్టేతో 'బ్రేక్'!

- రేవంత్ సర్కార్ కు గట్టి చెంపపెట్టు: బీఆర్ఎస్ నేత తిరుమలేష్
- అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ
- రాజకీయ కక్షసాధింపు చర్యలు ఆపాలి

**తొలివెలుగు, రాజాపేట:** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ సాగించిన అబద్ధపు ప్రచారాలు, రాజకీయ కుట్రలు హైకోర్టు తీర్పుతో బట్టబయలయ్యాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ విమర్శించారు. శుక్రవారం రాజాపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరంపై తప్పుడు ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కోర్టు స్టేతో గట్టి ఎదురుదెబ్బ తగిలిందని పేర్కొన్నారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టే ఇవ్వడం కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు వంటిదని అభివర్ణించారు. అభివృద్ధి పనుల కంటే రాజకీయ కక్షసాధింపు చర్యలకే ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ సమావేశంలో మదర్ డైరీ డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్, గుంటి మధుసూదన్ రెడ్డి, ఎర్రగోకుల జశ్వంత్, పల్లె సంతోష్ గౌడ్, కాకల్ల ఉపేందర్, మర్ల నాగరాజు, చెరుకు కనకయ్య, పంబ కర్ణాకర్, బొంగోన ఉపలయ్య, నాగిర్తి గోపి, యమ్మ భాస్కర్, పాండవుల భిక్షపతి, అశోక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యాదాద్రీశుడి సన్నిధిలో సీపీ సజ్జనార్

- కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనం
- వేద మంత్రాలతో ఆశీర్వచనం



**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జన్నార్ శుక్రవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి క్షేత్రానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భాలయంలో స్వయంభూ స్వామివారిని దర్శించుకుని, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం క్షేత్ర పరిధిలోని ముఖ మండపంలో సీపీ దంపతులకు అర్చకులు వేదమంత్రాలతో ఘనంగా ఆశీర్వచనం చేశారు. స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కాందూరి వెంకటాచార్యులు, శ్రీధర్ ఆచార్యులు, సురేంద్రాచార్యులు, వజ్జల లక్ష్మణాచార్యులు, మాధవాచార్యులతో పాటు ఆలయ అధికారులు సురేందర్ రెడ్డి, సీతారామాచార్యులు, చంద్రమౌళి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి సంతాపం


- యాదగిరిగుట్టలో కార్మికుల మౌన ప్రదర్శన
- బస్టాండ్ నుంచి డిపో వరకు నిరసన ర్యాలీ



**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అకాల మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ యాదగిరిగుట్టలో ఆర్టీసీ కార్మికులు శుక్రవారం మౌన ప్రదర్శన నిర్వహించారు. కార్మిక లోకానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ స్థానిక బస్టాండ్ ఆవరణ నుంచి నిరసన ర్యాలీ ప్రారంభించారు. నల్ల బ్యాడ్జీలు ధరించిన కార్మికులు అంబేద్కర్ విగ్రహం మీదుగా డిపో వరకు మౌనంగా నడిచారు. అనంతరం డిపో వద్ద ఏర్పాటు చేసిన శ్రద్ధాంజలి సభలో కార్మిక నాయకులు మాట్లాడుతూ.. తోటి కార్మికుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ మృతికి దారితీసిన పరిస్థితులపై విచారం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తగిన విధంగా అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట డిపోకు చెందిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్ విభాగం సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా ఎల్ఓసీ చెక్కుల పంపిణీ

- ప్రభుత్వ విప్ వేముల వీరేశం చొరవతో రూ. 2.50 లక్షల మంజూరు
- బాధితురాలు సాలమ్మ కుటుంబానికి అందజేత



MULA SRINIVASULU, LLM., MBA.,
.D. TO CHIEF MINISTER
VERNMENT OF TELANGANA

Room No.3,
Dr.B.R.Ambedkar T
Secretariat Hy
Ph.No. 040-2
Fax No. 040-2

CHIEF MINISTER'S OFFICE

Lr. No.4580/CMRF-LOC/2026, Dated:16-04-2026

To
The Director,
M/s NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82.

Sir,

Sub:- CMRF-Sanction of LOC Under CMRF to M/s NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82 towards treatment of individuals-Reg.

Ref:- 1. Letter from the SRI VEERESHAM VEMULA, Hon'ble MLA NAKREKAL - GOVT WHIP, dt.:22-03-2026

@@@

The Hon'ble Chief Minister desires that the treatment of GORLA SALAMMA, W/O MALLAIAH, TUMMALAGUDEM, YADADRI BHUVANAGIRI to be extended as the Hon'ble Chief Minister has assured for sanction of an amount of Rs.**2,50,000/-(Rupees Two Lakh Fifty Thousand Only)** to undergo CAROTID ARTERY BYPASS WITH SYNTHETIC GRAFT.

Necessary action may please be taken for providing treatment to the individual and send the bill after completion of the treatment.

With best wishes,

Yours sincerely,

(Vemula Srinivasulu)

Copy to:
SRI VEERESHAM VEMULA,
Hon'ble MLA NAKREKAL - GOVT WHIP

Copy to:
GORLA SALAMMA,
W/O MALLAIAH,
TUMMALAGUDEM, YADADRI BHUVANAGIRI

Note:- This letter does not require physical signature and this certificate can be verified by scanning QR code printed on this letter.

**తొలివెలుగు, రామన్నపేట:** ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్ఓసీ చెక్కులు కొండంత అండగా నిలుస్తున్నాయని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన గొర్ల సాలమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక స్థోమత లేని ఆ కుటుంబం పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే వీరేశం, ప్రభుత్వం నుంచి ఎల్ఓసీ మంజూరు చేయించేందుకు చొరవ తీసుకున్నారు. దీంతో ప్రభుత్వం నుంచి రూ. 2,50,000 విలువైన ఎల్ఓసీ మంజూరైంది. ఈ చెక్కును జిల్లా నాయకులు పూస బాలకిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, ఆపద సమయంలో ఎమ్మెల్యే ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. సకాలంలో ఆర్థిక సాయం అందేలా చూసిన ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## బొల్లిగుంట తండా రహదారి కష్టాలకు మోక్షం

- రూ. 70 లక్షలతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన
- మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో నిధుల మంజూరు
- దశాబ్ద కాలం తర్వాత నెరవేరుతున్న తండావాసుల కల

**తొలివెలుగు, టేక్మాల్:** టేక్మాల్ మండలంలోని బొల్లిగుంట తండా వాసుల దశాబ్దాల కాలం నాటి రహదారి కల సాకారమైంది. వేల్పుగొండ ఎస్సీ కాలనీ నుంచి బొల్లిగుంట తండా వరకు బీటీ రహదారి నిర్మాణానికి మంజూరైన రూ. 70 లక్షల నిధులతో శుక్రవారం ప్రజాప్రతినిధులు భూమి పూజ నిర్వహించారు. గత పదేళ్లుగా ఈ రహదారి అత్యంత అధ్వాన్నంగా మారి రాకపోకలకు వీలు లేకుండా ఉండటంతో తండావాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి ఆర్ అండ్ బీ శాఖ ద్వారా నిధులను మంజూరు చేయించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి పనులు వేగవంతం అయ్యాయని, మంత్రి రాజనర్సింహ ప్రత్యేక కృషితో టేక్మాల్ మండలంలో పెండింగ్ పనులు పూర్తవుతున్నాయని తెలిపారు. వర్షాకాలం లోపు ఈ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీరుడి దాస్, ఉప సర్పంచ్ సుధాకర్, నాయకులు ప్రేమ్ కుమార్, ఆకుల గంగారం, యోహాన్, మాజీ సర్పంచులు పౌలు, మాన్య నాయక్ తదితరులు పాల్గొన్నారు. తమ కష్టాలను గుర్తించి నిధులు కేటాయించిన మంత్రికి తండా నివాసితులు కృతజ్ఞతలు తెలిపారు.



# కాంగ్రెస్ కుట్రలకు కోర్టు తీర్పే సమాధానం

- కాళేశ్వరంపై అభాండాలు వేయడం తగదు
- రేవంత్‌రెడ్డి అనుభవ రాహిత్యమే శాపం
- 420 హామీలపై ప్రజలకు జవాబు చెప్పాలి: మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక విషయంలో హైకోర్టు వెలువరించిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి చెంపపెట్టు అని మాజీ ఎంపీపీ మాదుగుల ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం పురపాలక కేంద్రంలో బీఆర్ఎస్ మండల, పట్టణ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నేటికీ రాష్ట్రానికి సాగు, తాగునీటిని అందిస్తూ సజీవంగా ఉందన్నారు. కేసీఆర్ ప్రతిష్టను మసకబార్చేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ పన్నిన కుట్రలు కోర్టు తీర్పుతో బట్టబయలయ్యాయని పేర్కొన్నారు. అనుభవ రాహిత్యంతో సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల్లో నవ్వులపాలవుతున్నాయని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు చేయలేక, ప్రజల దృష్టి మరల్చడానికే కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కోట మల్లారెడ్డి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ కందడి భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సామ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు పెద్దల చక్రపాణి, కర్నాటి వరలక్ష్మి నరసింహ, కుడికాల అఖిల బలరాం, మండల పట్టణ ప్రధాన కార్యదర్శి చిలువేరు బాల నరసింహ, గునిగంటి మల్లేష్ గౌడ్, మాజీ సర్పంచ్ బత్తుల శ్రీశైలం గౌడ్, మహిళా నాయకురాలు కర్నాటి అంజమ్మ, పట్టణ నాయకులు యాకరి నర్సింగరావు, పర్సమోని సత్తయ్య, సంగం చంద్రయ్య, వెంకటేష్, సీత శ్రవణ్, జక్కిలి ఐలయ్య, యువజన విభాగం అధ్యక్షుడు కలుకూరు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో మౌలిక వసతులు ఏవీ..?



- ఫ్లైఓవర్, ఆసుపత్రి, డ్రైనేజీలపై సీపీఎం 'పోరుబాట'
- చైర్‌పర్సన్ మోగుదాల పావనికి సమస్యల చిట్టా అందజేత
- జిల్లా కమిటీ సభ్యులు, మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్

**తొలివెలుగు, చౌటుప్పల్ :** మున్సిపాలిటీగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా చౌటుప్పల్ పట్టణంలో మౌలిక వసతుల లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని సీపీఎం నాయకులు విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పోరుబాట' కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో పర్యటించిన నాయకులు, స్థానికంగా ఉన్న ప్రధాన సమస్యలను గుర్తించి ఓ నివేదికను రూపొందించారు. ఈ మేరకు ఆ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావనికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. బస్టాండ్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు పొంచి ఉన్నాయని.. దాన్ని నివారించడానికి హైవే విస్తరణలో భాగంగా బస్టాండ్ ఎదురుగా ఓపెన్ ఫ్లైఓవర్ బ్రిడ్జిని అత్యవసరంగా నిర్మించాలని నాయకులు కోరారు. వంద పడకల ఆసుపత్రి పనులు నత్తనడకన సాగుతున్నాయని, వాటిని వేగవంతం చేసి ప్రజలకు అంకితం చేయాలన్నారు. నాగులకుంటను మంచినీటితో నింపి సుందరీకరించాలని, నిరుపయోగంగా ఉన్న దివిస్ వాటర్ ప్లాంట్లను వెంటనే అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా చౌటుప్పల్, లింగోజిగూడెం, లింగారెడ్డిగూడెం, తంగడిపల్లి ప్రాంతాల్లో స్మశాన వాటికల నిర్మాణాలు చేపట్టాలని, పట్టణమంతా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండి పాషా, బండారు నరసింహ, బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, భావనలపల్లి స్వామి, బొడ్డు అంజిరెడ్డి, సప్పిడి శ్రీనివాసరెడ్డి, ఉష్కాగుల శ్రీనివాస్, తూర్పునూరి మల్లేశం, కందగట్ల ఆనంద్, గుణముని ఐలయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## రేవంత్‌ది భక్షించే ప్రభుత్వం: మధుసూదనాచారి

- డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య ప్రభుత్వ హత్యే
- బాధితుడి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలి
- ఆలేరు వద్ద మాజీ స్పీకర్ అరెస్టు.. వలిగొండకు తరలింపు

**తొలివెలుగు, వలిగొండ:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రక్షించే ప్రభుత్వం కాదని, ప్రజల ఆస్తులను, కార్మికుల జీవితాలను భక్షించే ప్రభుత్వమని మాజీ శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య నేపథ్యంలో, ఆయన మృతదేహాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న మధుసూదనాచారిని ఆలేరు వద్ద పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. అనంతరం ఆయన్ను వలిగొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శంకర్ గౌడ్ మృతి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని మండిపడ్డారు. ఒకే ఘటనపై పరామర్శకు వెళ్తున్న బండి సంజయ్‌కు అనుమతినిచ్చి, బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం ప్రభుత్వ వివక్షకు నిదర్శనమన్నారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో వైఫల్యం చెంది, కేవలం కేసీఆర్ పేరును విమర్శించడానికే రేవంత్ రెడ్డి ప్రాధాన్యతనిస్తున్నారని ధ్వజమెత్తారు. మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న ప్రభుత్వం, ఆర్టీసీకి చెల్లించాల్సిన రూ. 3000 కోట్ల బకాయిలను ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, మద్దెల మంజుల, మహమ్మద్ అఫ్రోజ్, పల్సం రాజు తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పుతో నిజం గెలిచింది

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం
- కాళేశ్వరంతోనే రాష్ట్రం సస్యశ్యామలం



**తొలివెలుగు, రామన్నపేట:** కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులకు హైకోర్టులో ఊరట లభించడం హర్షనీయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం అన్నారు. శుక్రవారం రామన్నపేట మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ప్రభుత్వం విచారణల పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రాంతం సస్యశ్యామలమైందని, గత పదేళ్లలో సాగు, తాగు నీటితో పాటు పారిశ్రామిక అవసరాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోయిందని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు తెలంగాణకు జీవనాడి అని, కోర్టు తీర్పుతోనైనా ప్రభుత్వం అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.




## నైపుణ్యంతోనే ఉజ్వల భవిష్యత్తు

- విద్యార్థి దశ నుంచే నైపుణ్యాలను పెంపొందించుకోవాలి
- సంక్షేమ వారోత్సవాల్లో అదనపు కలెక్టర్లు భాస్కర్ రావు, వెంకారెడ్డి
- జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' సభ

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే జీవితంలో స్థిరపడగలరని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా సంక్షేమ వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకారెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ.. ఐటీఐ, ఏటీసీల్లో అందించే వివిధ రకాల కోర్సులు ఉపాధికి ఎంతో దోహదపడతాయన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులు సొంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అదనపు కలెక్టర్ వెంకారెడ్డి మాట్లాడుతూ.. శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమలోని ప్రతిభకు పదును పెట్టుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ, టైలరింగ్ శిక్షణ ద్వారా నెలకు రూ.30 వేల వరకు సంపాదిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ నాగిరెడ్డి, ఉపాధి కల్పన అధికారి సాహితి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, జిల్లా యువజన క్రీడల అధికారి కె.ధనంజనేయులు, ఐటీఐ ప్రిన్సిపాల్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.





## పేదల పాలిట వరప్రదాయిని 'సీఎం రిలీఫ్ ఫండ్'

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చొరవతో రూ. 2.50 లక్షల వైద్య సాయం
- శివరెడ్డిగూడెం బాధితులకు ఎల్ఓసీ అందజేత

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** పేద ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా పాలన సాగుతోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని శివరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గుండెమోని సరితకు శస్త్రచికిత్స నిమిత్తం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 2,50,000 విలువైన ఎల్ఓసీ చెక్కును ఆయన బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో ఖరీదైన వైద్యం అందక ఇబ్బంది పడే నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్), ఎల్ఓసీలు కొండంత అండగా నిలుస్తున్నాయన్నారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, గ్రామ సర్పంచ్ బొక్క మల్లారెడ్డి, ఉప సర్పంచ్ చిలుకల సంతోష్ యాదవ్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మేకల రామకృష్ణారెడ్డి, మండల నాయకుడు నారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల ఆరోగ్యానికి భరోసా 'సీఎంఆర్ఎఫ్'

- పెద్దగూడెంలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
- సర్పంచ్ పకీరు లతా నర్సిరెడ్డి
- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి చొరవతో నిధుల మంజూరు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** అనారోగ్యం పాలై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని పెద్దగూడెం సర్పంచ్ ఫక్కీరు లతా నర్సిరెడ్డి అన్నారు. మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను శుక్రవారం ఆమె గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వెల్వర్తి బుచ్చయ్యకు రూ. 60,000, గంగముని మంజులకు రూ. 50,000, ఒంటెద్దు రాములుకు రూ. 29,500, బూరుగుల లక్ష్మణ్‌కు రూ. 22,500 విలువైన చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఫక్కీరు మల్లారెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ గుడి వద్ద సీసీ రోడ్డు పనుల ప్రారంభం

- పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని మౌలిక వసతుల కల్పనలో భాగంగా 9వ వార్డులో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. వార్డు పరిధిలోని రజక సంఘం ముత్యాలమ్మ గుడి వద్ద శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ఈ సీసీ రోడ్డు పనులను లాంఛనంగా ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో సరైన రహదారి సౌకర్యం లేక స్థానికులు, ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ఈ సమస్య మరింత జఠిలంగా మారుతుండటంతో.. రజక సంఘం నాయకులు ఇటీవల మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించి, తక్షణమే నిధులు కేటాయించి పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణాభివృద్ధికి, ప్రజల కనీస అవసరాల తీర్చడానికి తమ పాలకవర్గం ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, స్థానిక కౌన్సిలర్ దేప రమ్య రాజు, రజక సంఘం నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణకు సహకరించండి

- ఇంటింటికీ రానున్న బీఎల్ఓలు
- అధికారులకు ప్రజలు సహకరించాలి: తహసీల్దార్ వీరాబాయి



**తొలివెలుగు, చౌటుప్పల్:** ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) - 2026 ప్రక్రియలో భాగంగా ఓటర్లు తమ వివరాల నమోదు, మార్పుల కోసం సహకరించాలని చౌటుప్పల్ తహసీల్దార్ వీరాబాయి ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాల సేకరణ, మ్యాపింగ్ ప్రక్రియను ముమ్మరం చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఓటరు మహాశయులు తమ నివాసాలకు వచ్చే బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) అడిగే వివరాలను, ఆధారాలను సమర్పించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను సేకరించేందుకు అధికారులు ఇంటింటికీ వస్తారని, ఈ సమయంలో ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు ప్రజలకు అవగాహన కల్పించి అధికారులకు సహకరించేలా చూడాలని కోరారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వివరించారు.

# ప్రమాద బాధితులకు 'రోబోటిక్' పునర్జన్మ

- కత్తి కోత లేకుండా.. రోబోటిక్ చికిత్సతో కొత్త ప్రాణం!
- పాలీ ట్రామా బాధితులకు యశోద వైద్యుల వరం
- అవయవాల తొలగింపు అవసరం లేకుండానే పునర్నిర్మాణం
- అసాధ్యం అనుకున్న కేసుల్లోనూ అవయవాల పునరుద్ధరణ
- యశోద హాస్పిటల్స్‌లో అత్యాధునిక 'లింబ్ సాల్వేజ్' చికిత్సలు
- డాక్టర్ కిరణ్ కె. రెడ్డి బాదం బృందం కృషి

**తొలివెలుగు, హైదరాబాద్/సోమాజిగూడ:** రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి, అవయవాలు కోల్పోయే స్థితికి చేరుకున్న బాధితులకు అత్యాధునిక వైద్య సాంకేతికత అండగా నిలుస్తోంది. అసాధ్యం అనుకున్న కేసుల్లోనూ రోబోటిక్ టెక్నాలజీ సాయంతో అవయవాలను పునరుద్ధరిస్తూ యశోద హాస్పిటల్స్ వైద్యులు కొత్త ఆశలు చిగురింపజేస్తున్నారు. సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాలీ ట్రామా బాధితులకు అందుతున్న అత్యాధునిక చికిత్సల వివరాలను వైద్యులు వెల్లడించారు. దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల కారణంగా ఒకేసారి శరీరంలోని పలు భాగాలు దెబ్బతినడం (పాలీ ట్రామా) సాధారణమైందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎముకలు పూర్తిగా నుజ్జునుజ్జు అయితే సదరు అవయవాన్ని తొలగించడం మినహా మరో మార్గం ఉండేది కాదు. కానీ, యశోదలోని 'లింబ్ సాల్వేజ్ అండ్ రీకన్‌స్ట్రక్షన్' విభాగం ఇప్పుడు అద్భుతాలు చేస్తోంది. రోబోటిక్ అసిస్టెడ్ జాయింట్ రీప్లేస్మెంట్ ద్వారా సబ్ మిల్లీమీటర్ ఖచ్చితత్వంతో శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల ఎముక నష్టం తగ్గడమే కాకుండా, రోగులు త్వరగా కోలుకుంటున్నారని డాక్టర్ కిరణ్ కె. రెడ్డి బాదం వివరించారు. ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ ద్వారా వెన్నుముక సమస్యలకు కీహోల్ పద్ధతిలో చికిత్స అందిస్తున్నామని, శస్త్రచికిత్స జరిగిన కొద్ది గంటల్లోనే రోగులు నడిచే స్థితికి చేరుకుంటున్నారని ఆయన తెలిపారు.



# బెంగళూరు టాప్ షో



బెంగళూరు: డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు సొంతగడ్డపై మరోసారి సత్తాచాటింది. శుక్రవారం ఆ జట్టు చిన్నస్వామి వేదికగా గుజరాత్ టైటాన్స్‌ను 5 వికెట్ల తేడాతో చిత్తుచేసి ఈ సీజన్‌లో ఐదో విజయాన్ని నమోదుచేసింది. జీటీ నిర్దేశించిన 206 పరుగుల ఛేదనను ఆర్సీబీ మరో ఏడు బంతులుండగానే దంచేసింది. విరాట్ కోహ్లీ (44 బంతుల్లో 81, 8 ఫోర్లు, 4 సిక్సులు), దేవ్‌దత్ పడిక్కల్ (27 బంతుల్లో 55, 2 ఫోర్లు, 6 సిక్సులు) మెరుపులు మెరిపించారు. అంతకుముందు సాయి సుదర్శన్ (58 బంతుల్లో 100, 11 ఫోర్లు, 5 సిక్సులు) వరుసగా మూడో సీజన్‌లోనూ శతకం బాదడంతో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన టైటాన్స్ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 205 రన్స్ చేసింది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో ఆర్సీబీ 10 పాయింట్లతో రెండో స్థానానికి చేరగా నాలుగో ఓటమితో జీటీ ఏడో స్థానానికి పడిపోయింది. లక్ష్య ఛేదనలో కోహ్లీ, పడిక్కల్ దూకుడుతో బెంగళూరు విజయం ఆ జట్టు ఇన్నింగ్స్ 14 ఓవర్లలోపే దాదాపు ఖరారైంది. ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన జాకబ్ బెతెల్ (14) విఫలమైనా కోహ్లీ, పడిక్కల్ ద్వయం రెండో వికెట్‌కు 59 బంతుల్లోనే 115 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి డిఫెండింగ్ ఛాంపియన్ విజయానికి బాటలు పరిచారు. సిరాజ్ తొలి ఓవర్లో ఇంకా ఖాతా తెరువకముందే కోహ్లీ ఇచ్చిన క్యాచ్‌ను మిడ్ వికెట్ వద్ద వాషింగ్టన్ జారవిడువటం టైటాన్స్ కొంపముంచింది. ఆ తర్వాత కోహ్లీ.. పడిక్కల్ అండతో ఆకాశమే హద్దుగా రెచ్చిపోయాడు. పవర్ ప్లేలో 58/1తో ఉన్న ఆ జట్టు తర్వాత జోరు పెంచింది. కోహ్లీ ద్వయం.. రషీద్, ప్రసిద్ధ్‌ను లక్ష్యంగా చేసుకోవడంతో పది ఓవర్లకు ఆ జట్టు 118/1తో పటిష్టమైన స్థితిలో నిలిచింది. 30 బంతుల్లో కోహ్లీ, 27 బంతుల్లో పడిక్కల్ హాఫ్ సెంచరీలు పూర్తయ్యాయి. అయితే ఛేదన దిశగా సాఫీగా సాగుతున్న ఆర్సీబీ.. నాలుగు ఓవర్ల వ్యవధిలో పడిక్కల్, కోహ్లీ, జితేశ్ శర్మ (10), కెప్టెన్ రజత్ (8)వికెట్లను కోల్పోయినా కృనాల్ (23నా), డేవిడ్ (10నా) లాంఛనాన్ని ముగించారు.

సాయి నిలకడ

టైటాన్స్ ఇన్నింగ్స్‌లో భారీ మెరుపులేమీ లేకపోయినా సాయి వేగంగా ఆడుతూ రన్‌రేట్‌ను 10కి తగ్గకుండా చూసుకోవడంతో ఆ జట్టు ప్రత్యర్థి ఎదుట పోరాడగలిగే స్కోరును ఉంచగల్గింది. గిల్ 13 ఓవర్ల దాకా క్రీజులో ఉన్నా అతడు బ్యాట్ ఝుళిపించకపోయినా మరో ఎండ్‌లో సాయికి పూర్తి సహకారం అందించాడు. పవర్ ప్లేలో భువీ, రసిఖ్ ఓవర్లలో రెండేసి బౌండరీలు కొట్టిన సాయి.. హాజిల్‌వుడ్ బౌలింగ్‌లో 4, 6, 4తో దూకుడు పెంచాడు. షెఫర్డ్ ఓవర్లోనూ సిక్స్‌తో 33 బంతుల్లో అర్ధ శతకాన్ని పూర్తిచేశాడు. గిల్ జోరందుకోకపోయినా కృనాల్ బౌలింగ్‌లో సాయి రెండు సిక్సులతో విరుచుకుపడ్డాడు. సాఫీగా సాగుతున్న టైటాన్స్ ఇన్నింగ్స్‌కు సుయాశ్ షాకిచ్చాడు. 13వ ఓవర్లో అతడు వేసిన గూగ్లీని ఆడబోయిన టైటాన్స్ సారథి.. టైమింగ్ కుదరక పడిక్కల్‌కు క్యాచ్ ఇవ్వడంతో 128 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత అతడే వేసిన 15వ ఓవర్లో నాలుగో బంతికి సింగిల్ తీసిన సాయి.. వరుసగా మూడో సీజన్‌లోనూ సెంచరీ సాధించాడు. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారత బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు. గతంలో ఈ రికార్డు గేల్ (2011-13) పేరిట ఉండేది. కాగా శతకం తర్వాత సుదర్శన్.. హాజిల్‌వుడ్ ఓవర్లో అతడికే క్యాచ్ ఇచ్చాడు. బట్లర్ రెండు ఫోర్లు, 1 సిక్స్‌తో జోష్ మీదే కనిపించినా భువీ 18వ ఓవర్లో అతడి పనిపట్టడంతో టైటాన్స్ భారీ స్కోరు ఆశలపై నీళ్లు చల్లినట్టైంది. అయితే కృనాల్ ఆఖరి ఓవర్లో హోల్డర్ (10 బంతుల్లో 23 నాటౌట్, 1 ఫోర్, 2 సిక్సులు) మెరుపులతో ఆ జట్టు స్కోరు 200 రన్స్ మార్కును దాటింది.

**సంక్షిప్త స్కోర్లు**

గుజరాత్: 20 ఓవర్లకు 205/3 (సాయి 100, గిల్ 32, భువనేశ్వర్ 1/31, సుయాశ్ 1/36);

బెంగళూరు: 18.5 ఓవర్లకు 206/5 (కోహ్లీ 81, పడిక్కల్ 55, రషీద్ 2/49, సిరాజ్ 1/25)

# సూత్రధారులపై ఫోకస్ ఏదీ..?

సైబర్‌నేరాల్లో ఖాతాదారులతోనే కేసుల దర్యాప్తును సరిపెట్టేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీనికితోడు ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో ఉండే సైబర్‌నేరగాళ్ల బ్యాంకు ఖాతాదారులను పట్టుకోవడానికే పరిమితమవుతూ ఇతర రాష్ట్రాల్లో ఉండే క్రిమినల్స్ గురించి కనీసం ఆలోచన కూడా చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సైబర్‌నేరాలలో బ్యాంకు ఖాతాలు, సిమ్‌కార్డులు ప్రధానం. వీటిని ఇక్కడ అమాయకులు, కమిషన్ పద్ధతిలో ఖాతాలు సేకరించడం, సిమ్‌కార్డు డీలర్ల వద్ద నుంచి ఒకేసారి తీసుకోవడం చేస్తున్నారు. వీటిని ఇతర దేశాలలో ఉండే కీలకమైన సైబర్‌నేరగాళ్లకు పంపిస్తుండడంతో అక్కడి నుంచి సైబర్‌నేరగాళ్లు కొత్త కొత్త ఫోన్ నెంబర్లతో అమాయకులకు ఫోన్ చేసి వలేస్తున్నారు. విదేశాల నుంచి వాట్సాప్ కాల్స్‌లలో మాట్లాడుతూ, చాటింగ్‌లు చేస్తూ అమాయకులను సైబర్‌నేరాలలోకి లాగేస్తున్నారు. అత్యాశతో పెట్టుబడి, పార్ట్‌టైమ్ మోసాలు జరుగుతుండగా, భయంతో డిజిటల్ అరెస్ట్‌లు జరుగుతున్నాయి. సైబర్‌నేరగాళ్లు చెప్పినట్లు చేస్తూ సూచించిన బ్యాంకు ఖాతాలలో రూ.లక్షలు డిపాజిట్ చేస్తుంటారు. ఈ బ్యాంక్ ఖాతాల నిర్వహణ రెండు మూడు దశలలో జరుగుతుంది.

**బ్యాంకు ఖాతాలే కీలకం!**

బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతోనే దర్యాప్తు ప్రారంభిస్తారు. ఏ బ్యాంకు ఖా తాలో డిపాజిట్ చేశారు, ఆ బ్యాంకు ఖాతా ను ంచి ఎక్కడికెక్కడి బదిలీ అయ్యాయి, చివరకు ఏ ఖాతాకు వెళ్లాయనే అంశాలపై ఆరా తీస్తారు. ఇందులో భాగంగానే పోలీసులు బ్యాంకు ఖాతాదారుల చిరునామాతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేస్తుంటారు. అయితే బ్యాంకు ఖాతాదారులు కొందరు తెలిసి ఆయా ఖాతాలను కమిషన్లకు కక్కుర్తి పడుతూ సైబర్‌నేరగాళ్లకు అప్పగిస్తుండగా, మరికొందరు అందులో అమాయకులు కూడా ఉంటారు. అలాంటి వారిని పోలీసులు గుర్తిస్తూ తగిన విధంగా చర్యలు తీసుకోవడం సాధారణంగా జరుగుతున్న ప్రక్రియ అయితే, గతంలో వివిధ రాష్ట్రాలలో సైబర్‌నేరగాళ్ల గూర్చి పోలీసులు ఆరా తీస్తూ, కీలక నిందితులు ఎవరు అనే విషయంపై దృష్టి పెట్టేవారు. ఈ క్రమంలో కొన్ని కేసులలో కీలక నిందితులను పట్టుకోవడం, మరికొన్ని కేసులలో బ్యాం కు ఖాతాలను సైప్లె చేసే వాళ్లను, ఇంకా కొన్ని కేసులలో బ్యాంకు ఖాతాలు ఇక్కడి నుంచి మేనే జ్ చేస్తున్న ముఠాలను అరెస్ట్‌లు చేస్తూ కేసులను ఛేదించే వారు. అయితే నేడు అంత లోతుగా కేసుల దర్యాప్తు జరపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఫిర్యాదు రాగానే దర్యాప్తు ప్రారంభించి బ్యాంకు ఖాతాల చిరునామాలు ఎక్కడున్నాయని ఆరా తీస్తూ దగ్గరలో ఉంటే నిందితులను పట్టుకుంటున్నారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..





## ‘పెద్ది’ విడుదల ఆ రోజేనా?

**అగ్ర కథానాయకుడు రామ్‌చరణ్ ‘పెద్ది’ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. నాలుగు రోజుల పాటు జరిగే ఐటమ్ సాంగ్ చిత్రీకరణతో షూటింగ్ కంప్లీట్ అవుతుంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమాను ముందు ఈ ఏడాది మార్చి 27న విడుదల చేయాలనుకున్నారు. కానీ కుదరలేదు. ఆ తర్వాత ఏప్రిల్ 30న విడుదల అన్నారు. అది కూడా సాధ్యపడలేదు. తాజాగా జూన్‌లో ‘పెద్ది’ని విడుదల చేయనున్నట్టు నిర్మాత వెంకటసతీశ్ కిలారు ప్రకటించారు. కానీ డేట్‌ని మాత్రం ఖాయం చేయలేదు. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం జూన్ 25న ‘పెద్ది’ని విడుదల చేయాలని మేకర్స్ నిశ్చయించారట. ఈ తేదీ అన్ని విధాలుగా సినిమాకు కలిసొస్తుందని, ఇంకా రెండు నెలలు సమయం ఉండటం వల్ల పోస్ట్ ప్రొడక్షన్‌కి కావాల్సినంత సమయం దొరుకుతుందని, పానిండియా సినిమా కావడంతో దేశవ్యాప్తంగా పబ్లిసిటీని నిర్వహించేందుకు కూడా అవకాశం ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారు. అందుకే ‘పెద్ది’ విడుదల తేదీగా త్వరలోనే ‘జూన్ 25’ను అధికారంగా ప్రకటించనున్నారట. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందుశర్మ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఆర్.రత్నవేలు, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, సమర్పణ: మైత్రీమూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాణం: వృద్ధి సినిమాస్, దర్శకత్వం: బుచ్చిబాబు సానా.**



## విజయ్ చివరి సినిమాకు మరో అడ్డంకి.. “జన నాయగన్” సెన్సార్ మళ్లీ వాయిదా

జ్ఞుఋఝఋఝస్త్రుఋఅ । తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ నటిస్తున్న భారీ చిత్రం “జన నాయగన్” పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. దర్శకుడు హెచ్ వినోద్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో విజయ్ సరసన పూజా హెగ్డే, మమితా బైజు హీరోయిన్లుగా నటిస్తున్నారు. ముఖ్యంగా ఇది విజయ్ కెరీర్‌లో చివరి సినిమా అని ప్రకటించిన తర్వాత ఈ చిత్రంపై మరింత ఆసక్తి పెరిగింది. తమిళంలో “జన నాయగన్”గా వస్తున్న ఈ చిత్రాన్ని తెలుగులో “జన నాయకుడు” పేరుతో విడుదల చేయడానికి నిర్మాతలు సిద్ధమవుతున్నారు. అయితే అనేక అడ్డంకులు వలన ఈ సినిమా వాయిదా పడుతూ వస్తుంది. అసలు ఈ సినిమా ఈ ఏడాది జనవరిలోనే విడుదల కావాల్సి ఉంది. కానీ కొన్ని సెన్సార్ సమస్యల కారణంగా విడుదల వాయిదా పడింది. అభిమానులు కొత్త రిలీజ్ డేట్ కోసం ఎదురుచూస్తుండగా ఇప్పుడు మరోసారి ఈ సినిమాకు అడ్డంకి ఏర్పడినట్టు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, సినిమా సెన్సార్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండగా రివ్యూ కమిటీకి సంబంధించిన సెన్సార్ యూనిట్‌లో ఒక సభ్యుడి ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో సెన్సార్ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసినట్టు తెలుస్తోంది. దీంతో మరోసారి ఈ సినిమా సెన్సార్ వాయిదా పడినట్టు సమాచారం. ఇలా విజయ్ చివరి సినిమాగా వస్తున్న “జన నాయగన్”కు వరుస అడ్డంకులు ఎదురవడం అభిమానుల్లో నిరాశ కలిగిస్తోంది. ఇప్పటికే విడుదల వాయిదా పడిన ఈ చిత్రం ఎప్పుడు సెన్సార్ పూర్తి చేసుకుని ప్రేక్షకుల ముందుకు వస్తుందో అన్న ఆసక్తి ఇప్పుడు సినీ వర్గాల్లో నెలకొంది. మరోవైపు ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుద్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఆయన కంపోజ్ చేసిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని చిత్ర యూనిట్ భావిస్తోంది. భారీ నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్నాయి. విజయ్ కెరీర్‌లో చివరి సినిమాగా తెరకెక్కుతున్నందున “జన నాయగన్”పై అభిమానులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. మరి వరుస అడ్డంకులను దాటుకుని ఈ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందో చూడాలి.



## నా పేరు కరసామి..

ధనుష్ రైతు పాత్రలో నటిస్తున్న పీరియాడిక్ డ్రామా ‘కర’. 1991 నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకురానుంది. మమితాబైజు కథానాయికగా నటిస్తున్నది. విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఆర్‌స్టార్ లాజిస్టిక్స్ సంస్థలు తెలుగులో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాయి. శుక్రవారం టీజర్‌ను విడుదల చేశారు. ‘పాపమో, పుణ్యమో తను నాటింది తానే నరుక్కోవాలి, నేను నాటిన విత్తనం ఇప్పుడు కోత కొచ్చింది. అంతకంటే ముందు నామీద పడ్డ మచ్చని తుడిచేయాలి. నన్ను నమ్ముకున్న వారిని ముందుకు తీసుకెళ్లాలి..నా పేరు కరసామి..’ అనే వాయిస్ ఓవర్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. గ్రామంలోని ఓ సమస్యను పరిష్కరించేందుకు కరసామి సిద్ధపడటం, ఈ క్రమంలో ఆయన ఎదుర్కొన అవరోధాలను ఆవిష్కరిస్తూ టీజర్ సాగింది. కె.ఎస్.రవికుమార్, కరుణాస్, జయరామ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ సంగీతాన్నందిస్తున్నారు.



## అది పూర్తిగా అనైతికం

**సినిమా ప్రచార కార్యక్రమాలు, ఆడియో లాంచ్‌లు, అవార్డు వేడుకలు వంటి పబ్లిక్ ఈవెంట్లలో హీరోయిన్ల వస్త్రధారణపై చర్చలు కొత్త విషయం కాదు. బహిరంగ వేదికల్లో హీరోయిన్లను అనుచిత కోణాల్లో చిత్రీకరించడం విమర్శలకు దారి తీస్తోన్న నేపథ్యంలో కన్నడ చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు హీరోయిన్లు దీనిపై బహిరంగంగా గళం విప్పారు. కాంతారా చిత్రంతో గుర్తింపు పొందిన సప్తమి గౌడ**

**తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో.. మహిళా కళాకారులను కళాకారులుగానే చూడాలని, అనవసర జూమ్‌లు చేసి అవమానకరంగా చూపించడం పూర్తిగా అనైతికమని పేర్కొంది. ఆమె ఆవేదనకు రుక్మిణి వసంత్, ఆషికా రంగనాథ్ మద్దతు పలికారు. కళాకారిణుల వ్యక్తిగత గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత మీడియా, డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్‌కి ఉందని పేర్కొన్నారు.**

## జున్ను లవ్స్ యూ

**‘గమ్ గమ్ గణేశ’మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ నయన్‌సారిక. ఆ తర్వాత కిరణ్ అబ్బవరంతో కలిసి ‘ఆయ్’, ‘క’ సినిమాల్లో అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇటీవల విడుదలైన రొమాంటిక్ కామెడీ ‘విష్ణు విన్యాసం’ మూవీలోనూ జున్ను (మనీషా) పాత్రతో అలరించింది. ప్రస్తుతం, నయన్ చేతిలో క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిలో సంగీత్ శోభన్ తో జంటగా నటించిన ‘రాకాస’ మూవీ ఒకటి. మానసశర్మ డైరెక్టర్. ఉమేశ్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిహారిక కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఇప్పటికే మేకర్స్ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అలాగే మోహన్ లాల్ నటించిన వృషభ షూటింగ్‌లోనూ సారిక బిజీగా ఉంది. ఇక ఇటీవల రిలీజ్‌అయ్యిన ‘విష్ణు విన్యాసం’ చిత్రం సూపర్ హిట్ టాక్‌తెచ్చుకుంది. ఈసందర్భంగా అభిమానులను ఉద్దేశించి ఇంట్రెస్టింగ్‌పోస్ట్‌చేసింది నయన్.. ‘జున్ను మీ అందరినీ చాలా ప్రేమిస్తుంది. నన్ను సపోర్ట్‌చేస్తున్నందుకు థాంక్స్’ అంటూ ప్రేక్షకులతో పంచుకుంది.**

